# గంధోళి

సిగరెట్టు ముట్టించిన నారాయణ పొగ కంట్లోకి పోయినందున కళ్ళు చిట్లించి చిట్టిని చూస్తూ "మీ బావ ఇప్పట్లో రాడేమో ఇక నే వెడతాను" అన్నాడు.

"ఇంకొంచెంసేపు కూర్చోండి. వస్తాడేమో చూద్దాం. రెండు గంటలకే వస్తాడని అక్కయ్య చెప్పింది. ఇప్పుడు నాలుగు కావస్తోందికదా" అన్నది చిట్టి.

మంచంలో పడుకుని వున్న ముసలామె వాళ్ళిద్దరినీ చూస్తూ కాలం గడుపుతోంది. ఆమె చిట్టితల్లి.

ఆరోజు మధ్యాహ్నం రెండుగంటలు కావస్తున్నప్పుడు ఆ ముసలామె-కూతురు చిట్టి కొంత సామానుతో తెనాలి నించి ఆ ఇంట్లో దిగారు. అప్పటి వరకూ ఆ ముసలామె ఒక్కతే తెనాల్లో ఓ చిన్న గదిలో వుండేది.

కానీ చిట్టికి బాగా ముసల్దయిన తల్లిని ఒంటరిగా అక్కడ వుంచటం ఇష్టంలేక నెలకు ఓ వందరూపాయలు ఇచ్చే షరతుమీద గుంటూరులో వున్న అక్కయ్య ఇంటికి చేర్చింది ఆరోజునే.

సామానును సర్దటంలోనూ, ముసలామెతో ప్రయాణించటంలోనూ నారాయణ చిట్టికి బాగా సహకరించాడు. ఆయన వుండేది కూడ తెనాల్లో ఆ ముసలామె ఇంటి పక్కనే.

చిట్టి హైదరాబాద్ నుండి వచ్చి తల్లి దగ్గర వున్న మూడురోజుల్లోనూ ఆమెకీ, నారాయణకీ బాగా స్నేహం కుదిరింది. నారాయణ చొరవ, ఇతరులకు సహాయంచేసే తత్వం, పెదవులమీద ఎప్పుడూ చెరగని చిరునవ్వు, నొప్పించని మాటకారితనం చిట్టిని బాగా ఆకట్టుకున్నాయి.

నారాయణ గురించి కూతురికి కొంత చెప్పింది తల్లి. మిగిలిన విషయాలు నారాయణ ద్వారానే తెలుసుకుంది చిట్టి.

చిట్టి తల్లి దగ్గర వున్న మూడురోజులలోనూ ఆయన చెప్పిన మాటలకు తగ్గట్టుగానే ఎంతోమంది నారాయణ ఇంటికి వచ్చారు.

ఆయనతో ఏదో ఉద్యోగాల గురించీ, పెళ్ళిళ్ళ గురించీ మాట్లాడారు. అప్పుడప్పుడూ వాళ్ళ మాటలను చిట్టి కూడా విన్నది.

ఆ మాటలనుబట్టి నారాయణ ఓ గొప్ప సంఘసేవకుడనీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తూవుంటాడనీ, పెళ్ళికాని అమ్మాయిలకు పెళ్ళిళ్ళు

కుదురుస్తూవుంటాడనీ, అతనికి గొప్ప గొప్పవాళ్ల దగ్గర బాగా పలుకుబడి వున్నదనీ చిట్టికి అర్ధమయ్యింది.

అందుకే రెండేళ్ళ క్రితం డిగ్రీ పూర్తిచేసిన తన అక్కయ్య కొడుకు శంకరానికి ఏదయినా మంచి ఉద్యోగం ఇప్పించమని తెనాల్లోనే నారాయణను అడిగింది.

ఒప్పుకున్నాడు నారాయణ.

ఎవరో ఫ్రెండ్‌తో అరగంట క్రితం బయటకు వెళ్ళిన శంకరం ఇంటికి వచ్చాడు. కుట్టుమిషన్ నేర్చుకోటానికి శారదా నికేతన్‌కు వెళ్ళిన శంకరం అక్కయ్య గాయత్రి కూడా అప్పుడే ఇంటికి వచ్చింది.

కానీ చిట్టి బావ రామశాస్త్రి మాత్రం ఇంటికి రాలేదు. ఎదురింట్లోనో సత్యనారాయణ వ్రతం చేయించటానికి పొద్దున పది గంటలకు వెళ్ళాడుట.

“నే వెళ్ళాలి అమ్మాయ్. నాకోసం ఇప్పటికే చాలామంది వచ్చి తిరిగిపోతూ వుంటారు. నీకు తెలుసుకదా” అన్నాడు నారాయణ అసహనంగా.

“కూర్చోండి. పదినిముషాల్లో నాన్న రాకపోతే నేనే వెళ్ళి పిలుచుకువస్తాను” అన్నాడు శంకరం.

నారాయణ కూర్చొని మళ్ళీ ఓ సిగరెట్టు ముట్టించాడు. ఇంతలో చిట్టి అక్కయ్య సుందరమ్మ అందరికీ కాఫీలు తెచ్చింది.

నారాయణ కాఫీ గ్లాసునందుకున్నాడు.

సుందరమ్మ వెళ్ళిపోకుండా అక్కడే నిల్చుని “నువ్వు నా తమ్ముడిలాంటివాడివి. పేరుకు నాకూ ఇద్దరు తమ్ముళ్ళు వున్నారు. ఏనాడూ ఈ ఇంటికి రారు. నువ్వయినా మా శంకరానికి ఓ ఉద్యోగం చూసిపెట్టావంటే నీ మేలు ఈ జన్మలో మరచిపోం” అన్నది.

నారాయణ కాఫీ గుటకేసి “మీరింతగా చెప్పాలా అక్కయ్యగారూ. అమ్మాయ్ తెనాల్లోనే నాకు అంతా చెప్పింది. శంకరానికి ఉద్యోగం ఇప్పించే బాధ్యత నాది” అన్నాడు. ఆమె లోపలకు వెళ్ళింది.

“మామయ్యగారూ.... ఈ రోజుల్లో బ్యాంక్ ఉద్యోగాలు హాయిగా వుంటున్నాయి. నాక్కూడా బ్యాంక్ ఉద్యోగం చెయ్యాలని వుంది. రెండ్రోజుల క్రితం “గజలక్ష్మి బ్యాంక్ ఎగ్జామ్ రాశానని చెప్పానుకదా. దానికే ట్రై చెయ్యండి. కాకపోతే మరోదానికి ప్రయత్నం చెయ్యొచ్చు” అన్నాడు శంకరం.

"సరిగ్గా చెప్పావు. నేనూ దానిగురించే ఆలోచిస్తున్నాను. గజలక్ష్మి బ్యాంక్ రిజిస్టర్డ్ ఆఫీస్‌లో నాకు బాగా క్లోజ్‌గా వుండే ఓ ఫ్రెండ్ పనిచేస్తున్నాడు. ఆశ్చర్యమేమిటంటే వాడిది కూడా తెనాలే. మంచి కీ పొజిషన్‌లో వున్నాడు. జనరల్ మేనేజర్‌కి వీడు ఎంత చెబితే అంతే. వాడిని మనం కలవగలిగితే నీకు ఉద్యోగం వచ్చినట్టే" అన్నాడు నారాయణ.

శంకరానికి అప్పుడే ఉద్యోగం వచ్చినట్లయ్యింది.

చిట్టి ఏదో మాట్లాడబోతున్నప్పుడు వాళ్ళ బావ రామశాస్త్రి చేతితో సంచీ పట్టుకుని లోపలకు వచ్చాడు. ఆయన్ని చూడగానే నారాయణ "నమస్కారం బావగారూ" అన్నాడు.

రామశాస్త్రికి నారాయణను పరిచయం చేసింది చిట్టి.

"ఎప్పుడో వెళదామనుకున్నాను. మీకోసమే ఎదురుచూస్తున్నాను" అన్నాడు.

ఆయన ఎందుకు ఎదురుచూస్తున్నాడో చెప్పింది చిట్టి. "బావా.... నారాయణగారు తల్చుకుంటే మన శంకరానికి ఉద్యోగం వచ్చినట్టే. మీరు పరీక్ష రాసిన గజలక్ష్మి బ్యాంక్ హెడ్ ఆఫీసులో ఈయనకు బాగా తెలిసిన మనిషెవరో వున్నాడుట" అంటూ అన్ని విషయాలూ వివరంగా చెప్పింది.

రామశాస్త్రి ఎదురుగా కూర్చున్న నారాయణను అనుమానంగా చూశాడు.

"ఇంతకీ నేనేం చెయ్యాలి?" అనడిగాడు ఆయన.

"శంకరానికి ఉద్యోగం రావాలని మీరు అనుకుంటున్నారు కాబట్టి నేను ఈ రాత్రికే బెంగుళూరు వెళతాను. బ్యాంక్ హెడ్ ఆఫీస్ అక్కడే వుంది. నా స్నేహితుడితో మాట్లాడి రెండ్రోజుల్లో వస్తాను. నేను వెళితే చాలావరకు పని పూర్తయినట్టే.

ప్రస్తుతం నా దగ్గర డబ్బులు లేవు. ఖర్చులకింద ఓ ఐదొందలు ఇవ్వండి. ఈ రాత్రికే ప్రయాణం కడతాను" అన్నాడు నారాయణ.

"ఐదొందలా?" అన్నాడు రామశాస్త్రి.

నవ్వాడు నారాయణ.

చిట్టి-శంకరం-రామశాస్త్రిని అదోలా చూశారు.

"ఐదొందల గురించి ఆలోచిస్తున్నారు బావగారూ.... శంకరానికి బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చిందంటే నెలకు నాలుగువేల రూపాయలు సంపాదిస్తాడు. మీరే

ఆలోచించుకోండి. ఈ అవకాశం ఎవరికి ఇచ్చినా ఐదువేల రూపాయలను నా చేతిలో పోస్తారు. మీ కుటుంబంమీద నాకెందుకో అభిమానం కలిగింది. అందుకే ఈ సాయం చెయ్యాలనుకున్నాను. తర్వాత మీ ఇష్టం" అన్నాడు నారాయణ.

"బావా.... అయిదొందల గురించి ఆలోచించకు. నారాయణగారు తల్చుకుంటే శంకరానికి ఉద్యోగం వచ్చినట్టే" అన్నది చిట్టి.

"నాన్నా.... ఇంతకంటే అవకాశం మనకు మళ్ళీ రాదు. నారాయణగారు మనకోసమే ఇదంతా చేస్తున్నప్పుడు ఆయన మాటను కాదనటం బావుండదు" అన్నాడు శంకరం.

ఆయన భార్య సుందరమ్మ కూడా కలగజేసుకుని నారాయణకు అయిదొందలూ ఇచ్చి ఆ రాత్రికే బెంగుళూరు పంపించమని చెప్పింది.

డబ్బు విలువ తెలిసిన రామశాస్త్రికి ఐదొందల రూపాయలను ఓ అపరిచిత వ్యక్తికి ఇవ్వటానికి మనసు ఒప్పుకోలేదు. అలాగని ఇవ్వనంటే తనవల్లనే తనకి ఉద్యోగం రాలేదని శంకరం బాధపడతాడు. ఇంట్లో అందరికీ తనమీద కోపం కలుగుతుంది.

ఇప్పుడేమిటి చెయ్యటం?

"దానిగురించి ఇంకేమీ ఆలోచించకు బావా.... ఒకవేళ శంకరానికి ఉద్యోగం రాకపోతే ఆ ఐదొందలూ నేను ఇస్తాను" అన్నది చిట్టి.

ఇక తప్పుకునే అవకాశం రామశాస్త్రికి లేకపోయింది. అందుకే ఐదొందల రూపాయలు తెచ్చి నారాయణకి ఇచ్చాడు.

❖ ❖ ❖

"కనీసం సగం, ఐదువేలైనా ఇవ్వండి. నేను మళ్ళీ మీ దగ్గరకు రాను" అన్నాడు సూర్యారావు.

"మీరిచ్చిన డబ్బులన్నీ నేనే తీసుకుంటే మీ పదివేలూ ఇచ్చి వుండేవాడిని. ఏం చెయ్యమంటారు? మీరిచ్చిన పదివేలూ ఆ రైల్వే సూపర్నెంటుకు ఇచ్చాను. మీ సురేష్ ఉద్యోగం గురించి మొత్తం ఆయనే చూసుకుంటానన్నాడు.

కానీ ఇంటర్వ్యూ సమయానికి ఆయనకు ట్రాన్స్ఫర్ వచ్చింది. వెళ్ళిపోయాడు. ఆయన్ని డబ్బు అడిగితే వచ్చే ఆయనకు చెబుతానని అన్నాడు. చెప్పాడుట. ఈయన చెయ్యనన్నాడు. ఆయన డబ్బులు ఇవ్వలేదు. నేనేం చేసేది?" అన్నాడు నారాయణ.

"పదివేలూ పోయినట్టేనా?" అన్నాడు సూర్యారావు దిగులుపడుతున్నట్లుగా.

"కొన్నాళ్ళు ఆగండి. ట్రై చేద్దాం. ఇలా జరుగుతుందని నేనూ అనుకోలేదు. లేకపోతే మీ దగ్గరి డబ్బులు తీసుకునేవాడిని కాదు" అన్నాడు నారాయణ.

"నిన్ను నమ్మడం నా పొరపాటు...." అని ఏడుస్తూ వెళ్ళిపోయాడు సూర్యారావు.

నారాయణ సిగరెట్టు ముట్టించి పొగ వదిలాడు.

❖ ❖ ❖

"ఆ విషయం నాకు వదిలెయ్యండి. ఎండోమెంట్స్ మినిష్టర్ మనవాడే. ఈమధ్యనే రెండుసార్లు కలిశాను. కనీసం ముప్పైవేలైనా ఇవ్వందే పని జరగదు.

ఇంకో మనిషి దగ్గరయితే యాభై దాకా తీసుకుంటారు. అయితే ముందే మొత్తం డబ్బు ఇవ్వొద్దు. సగం పంపించండి. నేనే వెళ్ళి ఆయన్ని కలిసి డబ్బులిచ్చి లైన్ క్లియర్ చేసుకుని వస్తాను. మీవాడి ఉద్యోగం గురించి ఇక మీరు ఆలోచించే పనేలేదు. పూచీ నాది" అంటూ ఫోన్ పెట్టేశాడు నారాయణ.

❖ ❖ ❖

"శంకరం.... ఆవేశపడి ప్రయోజనం లేదు. నన్నేం చెయ్యమంటావ్? మనిద్దరం కలిసే బెంగుళూరు వెళ్లాం. నీకు బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పించే మనిషికి పదివేలూ ఇచ్చాం. తప్పకుండా నీకు బ్యాంక్‌లో ఉద్యోగం ఇస్తామని ఆయన నీతోనే చెప్పాడు.

కానీ తర్వాత జరిగిన బోర్డు డైరెక్టర్ల మీటింగ్‌లో ప్రస్తుతానికి కొత్తగా ఎవరికీ బ్యాంక్‌లో ఉద్యోగాలు ఇవ్వకూడదని తీర్మానించుకున్నారట. అందుకే నీకు ఉద్యోగం రాలేదు. ఇందుకు నన్నేం చెయ్యమంటావ్?" అన్నాడు నారాయణ.

"నువ్వేంచేస్తావో నాకు తెలీదు. మా అక్కయ్య పెళ్ళికోసం ఎన్నాళ్ళనుంచో కడుపు కట్టుకుని కూడబెట్టిన పదివేలూ నీ మాయ మాటలు నమ్మి నాకు ఉద్యోగం వస్తుందనే ఆశతో నీకిచ్చాడు మా నాన్న. నాకు ఉద్యోగం రాదని తెల్సిపోయింది.

ఇప్పుడు మా అక్కయ్యకు ఓ మంచి సంబంధం కుదిరింది. వెంటనే డబ్బులు కావాలి. నాకు ఉద్యోగం ఇప్పించే బాధ్యత నీదన్నావు కాబట్టి ఆ పదివేలూ నువ్వే ఇవ్వు. మూడో మనిషితో నాకు సంబంధం లేదు" అన్నాడు శంకరం మొండిగా.

"అందులో ఒక్క రూపాయి కూడా నేను తీసుకోలేదు. బెంగుళూరులో

ఆయన దగ్గర ఆ జబ్బులు ఖర్చయినాయట. ఇవ్వనన్నాడు.

ఆయన ఇచ్చినప్పుడు నీకు ఇస్తాను. లేకపోతే ఏ ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లోనో నీకు ఉద్యోగం ఇప్పిస్తానంటే వెళ్ళు. నా పరపతి గురించి నీకు తెలీదు" అన్నాడు నారాయణ సిగరెట్టు ముట్టించి.

"సీ" అని వెళ్ళిపోయాడు శంకరం.

❖ ❖ ❖

పెళ్ళి జరుగుతున్న ఇంటిముందు కారులో నుంచి దిగాడు నారాయణ. దిగటంతోనే దూరంగా ఎవర్నో చూసి "హల్లో" అంటూ వాళ్లదగ్గరకు వెళ్లాడు. కొంచెంసేపు వాళ్ళతో మాట్లాడి ఇంకెవరి దగ్గరికో వెళ్ళిపోయాడు.

ఇంటి వెనుకవైపు గాడిపొయ్యి తవ్వారు.

పెళ్ళి వంటకాలు తయారవుతున్నాయి.

అంతా ఎవరి పనుల్లో వాళ్ళున్నారు.

ఇంతలో పెళ్ళికూతురు మేనమామ కాబోలు హడావుడిగా అక్కడకు వచ్చాడు. "ఇంకో గంటలో భోజనాలు సిద్ధంకావాలి. వంట ఎంతవరకు వచ్చింది?" అనడిగాడు వెంకటపతిని.

"అంతా అయిపోయింది. మీ ఏర్పాట్లు మీరు చేసుకోవచ్చు. చెప్పిన టైముకు భోజనాలు సిద్ధం చెయ్యటం మా బాధ్యతకదా!" అన్నాడు వంటవాళ్ల నాయకుడు – బియ్యేలో గోల్డ్ మెడలిస్ట్ – నారాయణ కొడుకు వెంకటపతి. ❖

*స్వాతి వారపత్రిక, 13-13-1998*